
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



ఖమ్మం

ఉష్ణోగ్రత | ఖమ్మం : గరిష్ఠం 33 । కనిష్ఠం 18 | భద్రాద్రి : గరిష్ఠం 35 । కనిష్ఠం 25 | ఆదివారం, 18 ఫిబ్రవరి 2024 | 5

'వరి'దొడుకులు

- ప్రశ్నార్థకమైన యాసంగి సాగు
- అడుగంటిన భూగర్భ జలాలు
- పంటలు కాపాడుకునేందుకు లక్షలు వెచ్చిస్తున్న రైతులు

7



చూద్దాం పద... జాఫర్‌బావి



ఖమ్మం ఖిల్లాలో పునరుద్ధరించిన చారిత్రక జాఫర్‌బావిని కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం రాత్రి ప్రారంభించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ తాతా మధు, నగర మేయర్ నీరజ, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. అత్యంత దుర్భరంగా ఉన్న జాఫర్ బావికి పూర్వ వైభవం కల్పించటంలో నగర కమిషనర్ కృషి ఎంతో ఉందని కలెక్టర్ అభినందించారు. జాఫర్ బావి నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ కళా సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. కాకతీయులు, నిజాం నవాబుల పాలన సంస్కృతులను ప్రతిబింబించే కళారూపాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన శివతాండవం, ఖవ్వాలీ గీతాలు అలరించాయి.

-ఖమ్మం సాంస్కృతికం

పొంగులేటి ప్యాలెస్ @ నారాయణపురం



కల్లూరు మండలంలోని నారాయణపురం గ్రామం నవ్యకాంతులతో జిగేల్‌మంటోంది. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్వస్థలమైన ఈ పల్లెలో ఇప్పుడు ఓ కళ్లు చెదిరే ప్యాలెస్ అందరినీ అబ్బుర పరుస్తోంది. మంత్రి సోదరుడి కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుక ఆదివారం మధ్యాహ్నం నారాయణపురంలో జరగనుంది. ఇందుకోసం ఎంకే ఆర్కిటెక్ట్ అధినేత మల్లికార్జునరావు నేతృత్వంలో పీఎస్ఆర్ పేరుతో 70ఎకరాల్లో ఏకంగా ఓ ప్యాలెస్ సెట్టింగ్‌నే నిర్మించారు. ఈ వేడుకలో సుమారు 1.50 లక్షల మందికి వెజ్, నాన్‌వెజ్ భోజన ఏర్పాట్లు చేశారు. పలువురు మంత్రులు, వీఐపీలు రానుండటంతో భారీ ఏర్పాట్లు చేశారు. తిరువూరు క్రాస్ రోడ్డు వైపున హెలీప్యాడ్‌ను కూడా సిద్ధం చేశారు. ఈ నెల 14న గల్ఫ్‌లోని బహ్రెయిన్‌లో లోహిత్‌రెడ్డి పెళ్లి జరిగిన విషయం విదితమే.

-కల్లూరు

నేడు ముగ్గురు మంత్రుల పర్యటన



ఖమ్మం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం ముగ్గురు మంత్రులు పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉదయం 8గంటలకు హైదరాబాద్‌నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి ఉదయం 9-10గంటలకు భద్రాచలం చేరుకుంటారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాద్రి జిల్లా గండుగులపల్లి నుంచి భద్రాచలం చేరుకుంటారు. భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న అనంతరం ఉదయం 10-10 గంటలకు భద్రాచలంలో జరిగే ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో మంత్రులు పాల్గొంటారు. అనంతరం ముగ్గురు మంత్రులు హెలికాప్టర్‌లో కల్లూరు మండలం నారాయణపురానికి చేరుకుని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం 1-45గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరతారు.

గిరి'జన'గోస వినేదెవరు?

- అటవీ అనుమతులు లేక ముందుకుసాగని రహదారులు
- పూర్తిస్థాయిలో అందని పోడు పట్టాలు
- ఆస్పత్రుల్లో తీవ్రంగా సిబ్బంది కొరత
- నేడు ఐటీడీఏ పాలకమండలి సమావేశం
- పాల్గొననున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల



7

జోరుగా ఆకర్ష



- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలకు కాంగ్రెస్ గాలం
- కొత్తగూడెం, ఇల్లెందులో ఇప్పటికే పలువురి జంప్
- డీసీసీబీ పీఠం హస్తగతం, నేడో రేపో డీసీఎంఎస్ కూడా...
- తాజాగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం అడుగులు..
- చక్రం తిప్పుతున్న మంత్రి పొంగులేటి
- లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు బీటలు

ఖమ్మం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ 'ఆకర్ష'కు పదును పెట్టింది. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు జోరుగా కసరత్తు నడుస్తోంది. ఇప్పటికే కొత్తగూడెంకు చెందిన 20మంది బీఆర్ఎస్ మునిసిపల్ కౌన్సిలర్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇల్లెందు తదితర చోట్ల కూడా కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరారు. మరికొందరు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు మంతనాలు సాగిస్తున్నారు.

జిల్లాలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్న మునిసిపల్ పాలకవర్గాలను హస్తగతం చేసుకునేందుకు కార్యచరణ నడుస్తోంది. బీఆర్ఎస్‌కు చెందిన ఖమ్మం డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య సొసైటీలో కాంగ్రెస్‌లో చేరిన డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టి ఆయనను పదవి నుంచి తొలగించారు. దీంతో సొసైటీ పదవితోపాటు డీసీసీబీ ఛైర్మన్, డైరెక్టర్ పదవిని నాగభూషయ్య కోల్పోయారు.

గతంలో బీఆర్ఎస్ నుంచి డీసీసీబీ వైస్‌ఛైర్మన్‌గా ఎన్నికైన దొండపాటి వెంకటేశ్వరరావు ప్రస్తుతం డీసీసీబీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఆయన అసెంబ్లీ ఎన్నికల ముందే బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఆ తర్వాత మళ్లీ కొంతకాలం బీఆర్ఎస్‌లో కొనసాగారు. ఎన్నికల అనంతరం మళ్లీ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది.

ఇక డీసీఎంఎస్ ఛైర్మన్ విషయంలో మొదట్లో రాయల శేషగిరిరావు డిఫాల్టర్‌గా గుర్తించి ఆయన్ను సొసైటీ అధ్యక్ష పదవితోపాటు డీసీఎంఎస్ అధ్యక్ష పదవి నుండి తొలిగించారు. కాంగ్రెస్‌లో ఉన్న వైస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుకు ఛైర్మన్ బాధ్యతలు అప్పగించగా రాయల వరంగల్ ట్రిబ్యునల్‌కు వెళ్లి డీసీవో ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయించి ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. అయితే డీసీఎంఎస్‌ను కూడా కాంగ్రెస్ పరం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఇదిలా ఉంటే జిల్లాలో బీఆర్ఎస్‌కు ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుపై కూడా కాంగ్రెస్ గురిపెట్టింది. ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు మంతనాలు సాగిస్తున్నారని, లోక్‌సభ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీలో చేరతారని తెలిసింది. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అనుచరుడుగా ఉన్న వెంకటరావు శ్రీనివాసరెడ్డితో పాటే కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలం టికెట్ కాంగ్రెస్ నుండి తనకు రాకపోవడంతో బీఆర్ఎస్‌లో చేరి టికెట్ సాధించి గెలుపొందారు. ఆయన తిరిగి కాంగ్రెస్ గూటికి వచ్చే అవకాశం ఉంది.

అయితే వెంకటరావు వర్గీయులు ప్రస్తుతానికి అలాంటి ఆలోచన లేదని చెబుతున్నా పై స్థాయిలో ఇప్పటికే మంతనాలు పూర్తయ్యాయని, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పోస్టింగ్‌ల విషయంలో వెంకటరావు సిఫార్సులకు అనుకూలత లభించే అవకాశం కనిపిస్తుంది. ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నాటికి మరికొంత మంది ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. కొన్నిచోట్ల ముందు జాగ్రత్తగా బీఆర్ఎస్ నాయకులు ఆపార్టీకి రాజీనామా చేస్తున్నట్టుగా ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల తరుణంలో కాంగ్రెస్ గూటికి చేరేందుకు కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నారు.



విజేతలకు కలెక్టర్ కితాబు

ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 2వ, 4వ ర్యాంకులు సాధించిన మహిళా ప్రాంగణం విద్యార్థులు బైరం రచన, సాలవాడి మనీలను కలెక్టర్ వీపీ గౌతమ్ అభినందించారు. జిల్లాస్థాయిలో మొదటి పది ర్యాంకులు కూడా మహిళా ప్రాంగణం విద్యార్థులే కైవసం చేసుకోవడాన్ని ప్రశంసించారు. చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించాలని ఆయన సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మేనేజర్ విజేతతో సిబ్బంది పాల్గొన్నారు.

-ఖమ్మం కలెక్టరేట్



'మధిర' సెగ్మెంట్‌కు పాడి కాంతులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 17: మధిర నియోజకవర్గంలో ఇందిర డెయిరీ ఏర్పాటును పురస్కరించుకొని ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాలకు సబ్సిడీపై పాడి గేదెలను ప్రభుత్వం అందిస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సన్యాసయ్య ప్రకటించారు. ఖమ్మం టీటీడీసీలో ఇందిర డెయిరీపై శనివారం సమావేశం నిర్వహించారు. ఒక్కో మండలానికి 4వేల పాడి గేదెలను అందించాలనే లక్ష్యంతో కార్యాచరణ చేస్తున్నామన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ నీరజ

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి17: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మేయర్ పునుకొల్లు నీరజ నాయకులతో కలిసి కేక్ కట్‌చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీబాబా ఆధ్వర్యంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతా శిశుసంరక్షణ కేంద్రంలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, డీసీసీబీ మాజీఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య, నాయకులు బిచ్చాల తిరుమలరావు, బెల్లం వేణు, దోకుపర్తి సుబ్బారావు, బీఆర్ఎస్‌వీ నాయకులు షేక్ పాషా, యాసిన్, గోపి, ధీరజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉంటా

- డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు
- లాంఛనంగా బాధ్యతల స్వీకరణ



ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 17: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అభివృద్ధికి అందరి సహకారంతో శక్తివంచన లేకుండా కృషిచేస్తానని డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన డీసీసీబీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. ఛైర్మన్‌గా తాను రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రైతులకు సేవచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బ్యాంకు సిబ్బంది, పుర ప్రముఖులు దొండపాటికి శుభాకాంక్షలు తెలిపారు. కంభంపాడు గ్రామానికి చెందిన దొండపాటి వెంకటేశ్వరరావు కంభంపాడు సహకార సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం డీసీసీబీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కాగా డీసీసీబీ ఛైర్మన్‌గా ఉన్న కూరాకుల నాగభూషయ్య అవిశ్వాస తీర్మానంతో పదవిని కోల్పోవడంతో ఉపాధ్యక్షుడిగా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావును జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు ఛైర్మన్ నియమించి బాధ్యతలు అప్పగించారు. కొత్త ఛైర్మన్ ఎన్నికయ్యే వరకు దొండపాటి ఆ పదవిలో కొనసాగుతారు. దొండపాటి వెంకటేశ్వరరావు 1987, 1992, 2018 సంవత్సరాలలో కంభంపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశారు. 1995-2000 వరకు మధిర ఎంపీపీగా, అనంతరం ఆత్మ కమిటీ ఛైర్మన్‌గా, రైతుల సంఘం నాయకుడి వివిధ హోదాల్లో సేవలందించారు.

పట్టాలు తప్పిన గూడ్స్

- నాగులవంచ స్టేషన్ సమీపంలో ఘటన
- నాలుగు గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం



చింతకాని, ఫిబ్రవరి 17: చింతకాని మండలం నాగులవంచ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఉదయం 9గంటలకు చింతకాని రైల్వేస్టేషన్ దాటిన తరువాత 10 నిమిషాలు ప్రయాణించిన అనంతరం 113వ గేటు వద్దకు చేరుకోగానే గూడ్స్ రైలు రెండు వీల్స్‌ను అనుసంధానం చేస్తూ ఉన్న ఓ ఇనుప చట్రం విరిగిపోవడంతో ఒక్కసారిగా కుదుపునకు గురైంది. వెంటనే అప్రమత్తమైన లోకోపైలట్ రైలును నిలిపేశారు. ఖమ్మం నుంచి విజయవాడకు బొగ్గు లోడ్‌తో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న రైల్వే సాంకేతిక సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని పట్టాలు తప్పిన రెండు బోగీలను సుమారు రెండు గంటల పాటు శ్రమించి పక్కకు తప్పించారు. మధ్యాహ్నం 1గంటకు మరమ్మతులు పూర్తికావడంతో రైళ్ల రాకపోకలు పునరుద్ధరించారు. గూడ్స్ పట్టాలు తప్పడంతో సుమారు 4 గంటలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్యతోనే ఈ ప్రమాదం జరిగిందని రైల్వే అధికారులు ప్రకటించారు.

మేడారం భక్తులకు ప్రత్యేక రైళ్లు

- వివిధ ప్రాంతాలనుంచి వరంగల్‌కు 30 రైళ్ల ఏర్పాటు



ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 17: ములుగు జిల్లా మేడారంలో ఈ నెల 21 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వరంగల్ వరకు ఈ రైళ్లను నడపనున్నారు. జన్ సాధారణ్ పేరుతో 30 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. పూర్తిగా అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లతో ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. గతంలో రెండు ప్రాంతాల నుండి మాత్రమే ప్రత్యేక రైళ్లు నడిచేవి. ఈ సారి సికింద్రాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి నడుపుతున్నారు. అన్ని ప్రధానస్టేషన్లలో రైళ్లను ఆపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక రైళ్లలో 10 రైళ్లు సికింద్రాబాద్-వరంగల్- సికింద్రాబాద్ మధ్య, 8 రైళ్లు సిర్పూర్ కాగజ్‌నగర్ -వరంగల్- సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య, 8 రైళ్లు నిజామాబాద్ -వరంగల్- నిజామాబాద్, రెండు రైళ్లు ఆదిలాబాద్-వరంగల్- ఆదిలాబాద్, మరో రెండు రైళ్లు ఖమ్మం - వరంగల్- ఖమ్మం మధ్య నడుస్తాయని జీఎం తెలిపారు.

ఖమ్మం నుంచి ప్రత్యేక రైలు

ఖమ్మం రైల్వే స్టేషన్ నుంచి మేడారం జాతర కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. రైలు నెంబర్ 07021 23న ఉదయం 10 గంటలకు ఖమ్మంలో బయలుదేరి అదే రోజు 12.20 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నం. 07022న 13.55 గంటలకు వరంగల్‌లో బయలుదేరి అదే రోజు 16.30 గంటలకు ఖమ్మం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు మల్లెమడుగు, పాపటపల్లి, డోర్నకల్, గుండ్రాతిమడుగు, మహబూబాబాద్, కేసముద్రం, నెక్కొండ, చింతల్‌పల్లి స్టేషన్లలో రెండు వైపులా ఆగుతాయని, ఈ రైళ్లలో సెకండ్ క్లాస్ సిటింగ్ కోచ్‌లు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆర్టీసీ బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలి: భక్తులసౌకర్యార్థం మేడారం జాతరకు ఖమ్మం డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం కొత్తబస్టాండ్, ఇల్లెందు బస్టాండ్‌నుంచి ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇల్లెందు నుంచి 124, ఖమ్మం నుంచి 30బస్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. జాతర పాయింట్ వద్ద ప్రయాణికులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు. నేటినుంచి 25వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. మేడారం జాతర సందర్భంగా కొన్ని పల్లె వెలుగు బస్సులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సంఖ్య తగ్గించటం జరిగిందని, ప్రయాణికులు గమనించాలని కోరారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

▸ బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

▸ ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

▸ దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

▸ ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్‌ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్‌ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్‌ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై షైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై షైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై షైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్‌ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

▸ 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

▸ కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్‌ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ ఛైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

▸ కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్‌ఎస్ ప్రతిపాదన

▸ వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్‌ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్‌ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్‌ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

ముగ్గురిపై బైండోవర్ కేసు

దుమ్ముగూడెం ఫిబ్రవరి 17: విద్యుత్ తీగలు అమర్చి జంతువులను సంహరించే ముగ్గురిని తహసీల్దార్ చంద్రశేఖర్ ముందు శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ కేశవరావు తెలిపారు. మండలంలోని ముల్కనాపల్లికి చెందిన కాక వీరస్వామి, కాక సత్తిబాబు, తుర్రం సురేష్‌లపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అడవి జంతువుల వేటకోసం ఎవరైనా విద్యుత్ తీగలను అమర్చినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి17: ఇంట్లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన సత్తుపల్లి మునిసిపాలిటీలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రామాచారి ఆస్పత్రి రోడ్డులో నివాసం ఉంటున్న పిల్లి శరత్‌బాబుకు చెందిన యూనికాన్ ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం రాత్రి ఇంటిలో పార్క్ చేశాడు. ఉదయం చూసే సరికి ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

● ఐదుగురిపై కేసు నమోదు

పాల్వంచ, ఫిబ్రవరి 17: వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం పాల్వంచ మార్కెట్‌లోని ఓ నివాస గృహంలో ఇద్దరు మహిళలు మరి కొంతమంది మహిళలతో వ్యభిచారం చేయిస్తున్నారని సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. ఇద్దరు మహిళా నిర్వాహకులను, ఇద్దరు మహిళలను, ఒక విటుడిని అదులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

బాలుడి అదృశ్యం

చంద్రుగొండ, ఫిబ్రవరి 17: బాలుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని అయిన్నపాలెం గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగింది. ఎస్ఐ మాచినేని రవి తెలిపిన వివరాల ప్రకారం.. అయిన్నపాలెం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి దుర్గారావు, వెంకటరమణ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. తండ్రి దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దుర్గారావు కుమారుడు నాగచైతన్య చంద్రుగొండ ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 10న నాగచైతన్య ఇంటికి వెళ్లాడు. నాలుగు రోజులుగా బాలుడు తల్లి హాస్టల్‌కు వెళ్లమని చెబుతుండగా, నేను వెళ్లను అని ఇంట్లోనే ఉంటున్నాడు. కాగా రెండు రోజుల క్రితం తల్లి కూలి పనులకు వెళ్లి సాయంత్రం వచ్చే సరికి బాలుడు ఇంట్లో చైతన్య కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలుడి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో ఇద్దరి మృతి

కామేపల్లి, ఫిబ్రవరి 17:అనారోగ్యం కారణంతో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు గాడిపల్లి శ్రీకాంత్(28)కు మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అలాగే అదే గ్రామంలో పుచ్చకాయల నవ్య(31) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడతుంది. రెండు రోజుల క్రితం ఖమ్మంలోని ఓప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాలి

● కలెక్టర్ వీపీ గౌతమ్

ఘనంగా జాఫర్‌బావి ప్రారంభోత్సవం



పునరుద్ధరించిన జాఫర్ బావిని ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 17: వారసత్వ కట్టడాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, చారిత్రక ప్రదేశాల పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ఖమ్మం ఖిల్లాలో పునరుద్ధరించిన చారిత్రక జాఫర్ బావిని ఆయన శనివారం ప్రారంభించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ తాతా మధు, నగర మేయర్ నీరజ, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రక కట్ట డాలు ప్రతి ఒక్కరికీ గర్వకారణమ న్నారు. అత్యంత దుర్భరంగా ఉన్న జాఫర్ బావిని అందంగా తీర్చిదిద్ది పూర్వ వైభవం కల్పించటంలో నగర కమిషనర్ కృషి ఎంతో ఉందన్నారు. జాఫర్ బావిని పటిష్టంగా నిర్వహించేందుకు ప్రైవేటు సంస్థకు అప్ప గిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంకా డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహెరా, స్థానిక కార్పొ రేటర్ ఆలియా షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

జాఫర్ బావి ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ కళా సాంస్కృతిక అంశాలు సందర్శకులను అలరించాయి. కాకతీయులు, నిజాం నవాబుల పాలన సంస్కృతులను ప్రతిబింబించే కళారూపాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పేరిణి కళాకారులు ప్రదర్శించిన శివతాండవం కాకతీయుల కాలం నాటి కళావైభవాన్ని చాటింది. హైదరాబాద్‌కు చెందిన కళాకారులు ఖవ్వాలీ ఆలపించి ఆకట్టుకున్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



విద్యుదీపాలంకరణలో జాఫర్ బావి

ఈవీఎం మొదటి విడత పరిశీలన

ఖమ్మం కలెక్టరేట్: జిల్లాలో ఈవీఎంల మొదటి విడత పరిశీలన పూర్తి అయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం, వీవీప్యాట్ గోడౌన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత పరిశీలనలో తిరస్కరణకు గురైన ఈవీఎంలను మరమ్మతులకు కంపెనీకి ఎస్కార్ట్ భద్రతతో తరలించినట్లు తెలిపారు. అనంతరం గోడౌన్‌లో ఫస్ట్ లెవల్ చెకప్ అనంతరం భద్రపరచిన ఈవీఎం, వీవీప్యాట్ల గదుల తాళాలు, సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. సీసీటీవీ కెమెరాలు నిరంతరం పరిశీలించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ హుస్సేన్, నల్లమోతు తిరుమల రావు, జిఎస్ఆ ర్‌పి. విద్యాసాగర్, చీకటి రాంబాబు, సింగు రాజయ్య కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలి: డీఎఫ్‌వో

జూలూరుపాడు, ఫిబ్రవరి17: వేసవిలో జిల్లాలోని అటవీ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని డీఎఫ్‌వో కిష్టగౌడ్ సూచించారు. శనివారం జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని సూరారం బీట్ పరిధిలోని కనకగిరి అటవీ ప్రాంతాన్ని ఆయన ఎఫ్‌డివో కోటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో అగ్గి వేయకుండా అటవీ ప్రాంత సమీప గ్రామాలలోని ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించాలని తెలిపారు. వేసవిలో అటవీ ప్రాంతాలలో అడవి జంతువులకు నీటిని అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో ప్రసా ద్‌రావు, డీఆర్వోలు ధనలక్ష్మి, లక్ష్మీనర్సు సిబ్బంది మల్లయ్య, సలీం, కిషన్,రహీం, నరసింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాల కట్టడికి చెక్ పోస్టుల ఏర్పాటు

బూర్గంపాడు ఫిబ్రవరి17: మండల పరిధిలోని మోరంపల్లి బంజర గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను భద్రాచలం ఆర్డీఓ మంగిలాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్ పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. చెక్ పోస్ట్‌ను తహసీల్దార్ ముజాహిద్, ఎస్ఐ సుమన్‌లు, బూర్గంపాడు మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలించే ప్రాంతాలను తహసీల్దార్ సుమన్ పరిశీలించారు.

మణుగూరుటౌన్: అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు తహసీల్దార్ రాఘవారెడ్డి మండల పరిధిలోని రామానుజవరం, పట్టణంలోని టీడీపీ సెంటర్లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులు, సిబ్బందిని కేటాయించారు. కాగా పట్టణంలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆర్ లీలావతి పట్టుకున్నారు. ట్రాక్టర్ యాజమానికి రూ.5వేలు జరిమానా విధించారు. ఇసుకను అక్రమంగా తరలిసర్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాఘవరెడ్డి హెచ్చరించారు. ఇసుక ట్రాక్టర్ ఈజీఎస్‌పనుల నిమిత్తం తీసుకువెళ్లున్నారని, రెవెన్యూ కార్యాలయంనుంచి ఎటువంటి ముందస్తు అనుతమతులు తీసుకోనందున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ఏడు ఇసుక లారీలు సీజ్...

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు లారీలను పాల్వంచ బస్టాండ్ ప్రాంతంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరిసీతరామరాజు జిల్లా నుంచి అక్రమంగా లారీల్లో ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న అధికారులు పాల్వంచ బస్టాండ్ ప్రాంతంలో లారీలను ఆపి తనిఖీ చేశారు. ఇసుకకు సంబంధించి ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని పాల్వంచ పట్టణ పోలీసులకు అప్పగించారు. లారీ యజామానులపై ఏమి చర్యలు తీసుకున్నారు అనే విషయంపై మైనింగ్ ఏడీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

అప్పు ఇచ్చిన వ్యక్తిపై దాడి...

పాల్వంచ, ఫిబ్రవరి 17: అప్పు ఇచ్చిన వ్యక్తిపై అప్పు తీసుకున్న వ్యక్తి తరపు బంధువులు దాడి చేసిన సంఘటన పాల్వంచ టౌన్ గాంధీనగర్‌లో శనివారం జరిగింది. టౌన్ ఎస్ఐ బాణాల రాము తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక నవభారత్ గాంధీనగర్‌కు చెందిన జట్‌పట్ గురవయ్య హమాలీగా పాల్వంచ మార్కెట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తనతో పరిచయమైన పల్లపు రంగాకు రూ.50 వేలు అప్పుగా ఇచ్చాడు. పలుమార్లు అప్పు ఇవ్వమని అడగ్గా రూ.20 వేలు అప్పు తీర్చాడు. మిగిలిన అప్పు ఇవ్వమని అడగడంతో శనివారం రంగా బావమరిది శివరాత్రి సంపత్, ఇద్దరు మహిళలు కలిసి పని చేసుకుంటున్న గురవయ్యను మార్కెట్‌లో ఆపి అసలు రంగాకు డబ్బులు ఎందుకు ఇచ్చావు, ఎందుకు తిరిగి అడుగుతున్నావు అని దుర్భాషలాడుతూ భౌతిక దాడికి పాల్పడ్డారని తెలిపారు. గురవయ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

రూ. 20వేలు నగదు, బంగారు పుస్తె అపహరణ

కామేపల్లి, ఫిబ్రవరి 17: పట్ట పగలే ఓ ఇంట్లో దొంగలు పడి ఇంటో ఉన్న బంగారం నగదు అపహరించుకోని పోయిన సంఘటన మండల పరిధిలోని ఊట్కూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్ల వెంకటయ్య దంపతులు వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం ఇంటికి తాళం వేసి వెళ్లారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు తాళాలను పగులగొట్టి బియ్యం డబ్బాలో ఉన్న రూ.20వేలు నగదు, బంగారు పుస్తెను ఎతు కొని పోయారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తాళాలు పగలగొట్టి ఉండడంతో బాధితుడు వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సృజనాత్మకత పెంపొందించడానికి బాలోత్సవ్ దోహదం

● పోస్టర్‌ను ఆవిష్కరించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

చుంచుపల్లి, ఫిబ్రవరి17: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి తెలంగాణ బాలోత్సవ్ ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ బాలోత్సవ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి నిర్వాహకులను ప్రత్యేక అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గతం గా దాగి ఉన్న ప్రతిభ, వారిలోని సృజనాత్మక శక్తిని, ఆత్మ విశ్వాసాన్ని కలిగించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఇటువంటి బాలోత్సవ్‌లు ఎంతో అవసరమ న్నారు. విద్యార్థులు ఈ బాలోత్సవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్‌ను ఆయన అభినందించారు. అభ్యు దయ కళా సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28వ తేదీలలో కొత్తగూ డెం సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే ఈ రాష్ట్ర స్థాయి బాలోత్సవ్‌ను విజ యవంతం చేయాలని కన్వీనర్ శివకుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సింగరేణి జీఎం అందెల ఆనందరావు, సినీ న టులు, నిర్మాత, దర్శకులు రావిపల్లి రాంబాబు, ఆదర్శ ఫౌండేషన్ అధినేత బోగరాజు తదితరులు పాల్గొన్నారు.

198 క్వింటాల రేషన్ బియ్యం స్వాధీనం

దమ్మపేట, ఫిబ్రవరి17: లారీలో అక్రమంగా తరలిస్తున్న 198క్వింటాల రేషన్ బియ్యాన్ని ముష్టిబండ గ్రామ సమీపంలో శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సాయికిషోర్ తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి యానాంకు బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ముష్టిబండ సమీపంలో బియ్యం లారీని పట్టుకున్నామని తెలిపారు. బియ్యం ఎర్రుపాలానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. లారీ డ్రైవర్ రామస్వామిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి.. గాజులెత్తుకెళ్లిన దొంగలు

కామేపల్లి, ఫిబ్రవరి 17: ఓ వృద్ధురాలిని గాయపరిచి చేతికి ఉన్న గాజులను ఎత్తుకెళ్లిన సంఘటన పండితాపురంలో బుధవారం జరిగింది. ఈసంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పండితాపురం గ్రామానికి చెందిన పాటి భూషమ్మ కుమరుడు ఇంటికి తాళం వేసి బుధవారం బయటకు వెళ్లారు. ఇంటి ముందు ఉన్న వరండాలో ఉన్న భూషమ్మ గమనించిన ముగ్గురు దొంగలు బైక్‌పై వచ్చి ఆమె మొఖంపై క్లాత్ వేసి చేతికున్న గాజులను లాక్కెళ్లారు. ఈక్రమంలో ఆమె చేతికి తీవ్ర గాయలయ్యాయి. అసలు విషయం ఏమిటంటే ఆమె చేతికి ఉన్న గాజులు వన్‌గ్రామ్ గోల్డ్ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గుడుంబా తయారీ ముడి సరుకులు పట్టివేత

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 17: గుండుబా తయారీకి కావాల్సిన ముడి సరుకులను తరలిస్తున్న వాహనాలను ఖమ్మం సరిహద్దులోని వెంకటగిరి- గుదిమళ్ల కూడలిలో శనివారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కృష్ణ జిల్లా జగ్గయ్యపేట నుంచి ఖమ్మం మీదుగా వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు గుడుంబా తయారీకి కావాల్సిన ముడి సరుకులు రవాణా అవుతున్నాయన్న సమాచారం మేరకు ఖమ్మం రెండో పట్టణ ఎక్సైజ్‌శాఖ అధికారులు, డీటీఎఫ్ బృందం ఖమ్మం సరిహద్దులోని వెంకటగిరి- గుదిమళ్ల కూడలిలో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. ఈ తనిఖీలలో 2,450 కేజీల పట్టిక, 200 కేజీల నల్లబెల్లం, 20 లీటర్ల గుడుంబా సారాయిను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను అదుపులోకి విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో డీటీఎస్ ఇన్‌స్పెక్టర్ కరుణశ్రీ, ఎస్ఐ సరిత, సిబ్బంది ఉన్నారు.

జంతువులను వేటాడితే చర్యలు: ఎఫ్‌డీవో

మణుగూరు, ఫిబ్రవరి17: ఎవరైనా జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మోహినుద్దీన్ హెచ్చరించారు. శనివారం ఫారెస్టు డివిజన్ కార్యాలయంలో స్వాధీనం చేసుకున్న ఆయుధాలను, జంతు కొమ్ములను, చర్మాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జంతువులను వేటాడే ఆయుధాలను ఎలా వినియోగిస్తారో సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ద్వాలియా, ఏడూళ్లబయ్యారం ఎఫ్ఆర్ఓ తేజస్విని, అశ్వాపురం ఎఫ్ఆర్ఓ రమేష్, సిబ్బంది గోవింద్, వెంకటలక్ష్మి, నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

యాసంగిలో.. 'వరి'దొడుకులు

యాసంగి పంటలు సాగు చేసిన రైతులు గోసపడుతున్నారు. వందల ఎకరాల్లో వరి, మిరప, మొక్కజొన్న పంటలు ఎండుతున్నాయి. అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన కొద్దిపాటి వర్షాలకు కుంటలు, చెరువుల్లో ఉన్న నీటితో సాగుకు నడుం బిగిస్తే రైతుల కష్టాన్ని కరువు కాటేసింది. ఎన్నో ఆశలతో సాగు చేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు నోటికొచ్చే సమయంలో నిలువెల్లా మాడిపోతున్నాయి. అప్పులు చేసి పెట్టుబడులు పెడితే సాగునీరులేక పంటలను వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది.



- అడుగంటిన భూగర్భ జలాలు
- పంటను కాపాడుకునేందుకు రూ. లక్షలు వెచ్చిస్తున్న రైతులు
- సాగర్ నీరు అందించాలని వేడుకోలు
- పంటలు వదిలేస్తున్న అన్నదాతలు

నేలకొండపల్లి/ చింతకాని/ కూసుమంచి, ఫిబ్రవరి 17: భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. బోర్లు, బావుల్లో నీరు పాతాళానికి చేరింది. జనవరి నెలలో 18 అడుగుల లోతులో ఉన్న భూగర్భ జాలాలు ఫిబ్రవరి మొదటి వారంలో 22 అడుగులకు పడిపోయాయి. బావులలో నీరు కూడా కేవలం రెండు నుంచి మూడు గంటలే వస్తుండటంతో పంటలకు తగినంత నీరు లేక ఎండిపోతున్నాయి. నీరు సరిపోక సాగు చేసిన పొలంలో సగానికి పైగా వదిలేస్తున్నారు.

కొత్త బావులు, పూడిక తీతలు..

పంటలను కాపాడుకునేందుకు రైతులు రూ. లక్షల్లో వెచ్చిస్తున్నారు. అదనంగా బోర్లు, బావులు తీయిస్తున్నారు. మిషన్లు తెచ్చి పూడికను తీయిస్తున్నారు. చింతకాని మండల వ్యాప్తంగా 22 చెరువులకు సాగర్ నీరే ప్రధానం. తీవ్ర వర్షాభావంతో గ్రామాల్లో చెరువులు అడుగంటాయి. పశువులు తాగేందుకు కూడా చెరువుల్లో చుక్కా నీరు లేదు. తరిగిపోతున్న భూగర్భ జలాలతో ఎండుతున్న పంటలను కాపాడాలంటే సాగర్ నీరు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపితే తప్ప పంటలు చేతికందే పరిస్థితి కనపడుటలేదు.

నాచేపల్లి రైతుల పాట్లు

సాగర్ ద్వారా పాలేరు రిజర్వాయర్ వస్తుందని ఆశించిన రైతులు నేలకొండపల్లి మండలంలో భారీగా వరి సాగుచేశారు. నాచేపల్లిలో వాగు, బావులు, బోర్ల కింద వందల ఎకరాల్లో వరి వేశారు. కొంత మంది వాగును నమ్ముకుని, మరి కొంత మంది పొలాల్లో బావులు, బోర్లున్నాయన్నా ధీమాతో పంటలను సాగు చేశారు. వాస్తవంలో పైనుంచి నీరు రాక పోవటం, వర్షాలు లేకపోవటంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. వాగులు సైతం ఎండిపోయాయి. నాచేపల్లి రైతులు పంటలను కాపాడుకోవటానికి వాగలో ఎక్సకవేటర్ తెచ్చి గుంతలు కొడుతున్నారు. రైతులు తమ పొలం సమీపంలో వాగులో గుంత తవ్వుతున్నారు.

మంత్రి గారు పట్టించుకోండి..

పాలేరు, పెరికశింగారం, జక్కేపల్లి, గోరీలపాడుతండ, చాంప్లాతండల్లో, నేలకొండపల్లి మండలంలోని పలుగ్రామాల్లో భూమి నెర్రలుబాసింది. పాలేరు పరిధిలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి, చెరకు వేశారు. పాలేరు జలాశయం ఏర్పడే ముందే, జలాశయంలో నీరు ఉన్నా లేకున్నా పాత కాల్వకు నీరు ఇవ్వాలనే హక్కు కల్పించారని రైతులు పేర్కొంటున్నారు. పాలేరు చెరువుగా ఉన్నప్పుడే కాల్వ ఉందని, పంటలకు నీరు వదలాలని రైతులు కోరుతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించి పంటలను కాపాడాలని కోరుతున్నారు.


చింతకానిలో పూడిక తీయిస్తున్న దృశ్యం

సాగర్ నీరు ఇచ్చి ఆదుకోవాలి
మేకపోతుల వెంకటేశ్వర్లు, లచ్చగూడెం,



ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. జనవరి నెల వరకు బావి, బోరులో ఉన్న నీరు ఆరు ఎకరాలకు సరిపోయేవి. వారం రోజుల నుంచి బోరులో నీరు సరిగా రాకపోవడంతో ప్రస్తుతం నాలుగు ఎకరాలకే నీరు సరిపోతుంది. రూ.50 వేలు పెట్టి రెండు బోర్లు వేయించా.. కాని సఫలం కాలేదు.

రెండెకరాలే మిగిలింది
రాచబంటి శ్రీను, వందనం



మా పొలంలో ఉన్న బావి నీరు ఆధారంతో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. నాలుగు ఎకరాలకు రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. ఎండలు ముదరడంతో నీరు రెండు గంటలే వస్తుంది. పంట చేతికొచ్చేందుకు ఇంకా రెండు నెలల సమయముంది.

11 ఎకరాలు ఎండిపోయింది..
నల్గొండ వెంకటేశ్వర్లు, నాచేపల్లి



నాకు ఉన్న రెండు ఎకరాల్లో ఎకరంన్నరతో పాటుగా మరో తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట వేశాను. వాగు కింద ఎకరంన్నర, మిగిలినది బావుల కింద సాగుచేశా. వాగులో, బావుల్లో నీరు లేక పోవటంతో పొలం పూర్తిగా నెర్రెలు కొట్టింది. పరిస్థితి ఇంతే ఉంటే వారం రోజుల్లో మొత్తం ఎండిపోతుంది. ఎకరాకు ఇప్పటి వరకు రూ.15వేల వరకు పెట్టుబడులు పెట్టా. పెట్టుబడులకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియటం లేదు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 17: ఫిబ్రవరి 28నుంచి మార్చి 16వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అడిషినల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం నూతన కలెక్టర్‌లో పరీక్షలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మెదటి సంవత్సర విద్యార్థులు 18,481మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 18,097మంది హాజరుకానున్నట్లు తెలిపారు. నిమిషం నిబంధన అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఐఈవో రవిబాబు, డీఈవో సోమశేఖర శర్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాములోరికి స్వర్ణ తులసార్చన, నిత్యకల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 17: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం సందర్భంగా ఆర్జిత సేవలో భాగంగా స్వామి వారికి స్వర్ణ తులసార్చన నిర్వహించారు. స్వామి వారి నిత్యకల్యాణం సైతం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈవోను కలిసిన పలువురు నాయకులు

భద్రాచలం దేవస్థానం ఈవోగా పునర్నియామకమైన ఎల్.రమాదేవిని శుక్రవారం పట్టణానికి చెందిన పలు రాజకీయ పక్షాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఈవోకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకోజు సునీల్, బి.వెంకటరెడ్డి, కోలా రాజు, లంకపల్లి విశ్వనాథ్, మల్లెల లోకేష్, బద్దిబాబి, కొలిపాక విశవింజం నాగసాయి, బత్తుల నరసింహులు పాల్గొన్నారు.

28 నుంచి కరుణగిరి ఉత్సవాలు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి17: కరుణగిరి ఉత్సవాలు ఈ నెల 28 నుంచి మార్చి 2వరకు నిర్వహించనున్నట్లు బిషప్ ఉడుముల బాల శనివారం తెలిపారు. కరుణగిరి ఉత్సవాల పోస్టర్‌ను కరుణగిరి చర్చిలో ఆవిష్కరించారు.

మార్చి 14వరకు పట్టభద్రుల నమోదు

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నూతన ఓటు నమోదుకు మార్చి 14 వరకు దరఖాస్తులకు రాష్ట్రఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1నవంబరు 2020 వరకు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు నూతన ఓటర్లగా చేరేందుకు అవకాశం ఉందన్నారు.

కిక్కు ఎక్కేదెలా..?!



- డిమాండ్ ఉన్న రెండు మద్యం బ్రాండ్ల కొరత
- డిస్టిలరీల నుంచి తగ్గిన సరఫరా
- మద్యం ప్రియుల అసంతృప్తి

వైరా, ఫిబ్రవరి 17: ఉమ్మడి జిల్లాలో డిమాండ్ ఉన్న రెండు మద్యం బ్రాండ్ల కొరత ఏర్పడింది. 15రోజుల నుంచి ఈ రెండు రకాల మద్యం అరకొరగా మాత్రమే సరఫరా అవుతోంది. సామాన్య మందుబాబులు ఎక్కువగా ఉపయోగించే ఓల్డ్ అడ్మిరల్ బ్రాండ్(ఓఏబీ), మ్యాన్షన్‌హౌజ్ బ్రాందీ(ఎంహెచ్)రకాల బ్రాండ్ల కొరత ఏర్పడింది. రాష్ట్రంలోనే ఓఏబీ విక్రయాల్లో ఉమ్మడి జిల్లాకు ప్రథమస్థానం ఉంది. ఎంహెచ్‌కు కూడా డిమాండ్ ఉంది. ఈ రెండురకాల బ్రాండ్లు దుకాణాల్లో లభ్యం కాక మద్యం ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెలకు రూ. 200 కోట్ల మద్యం

ప్రభుత్వం ఈ కంపెనీలకు బిల్లులు చెల్లించనందున అరకొరగా మాత్రమే ఐఎంఎల్ డిపోకు మద్యాన్ని సరఫరా చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 210వైన్‌షాపులు, 50బార్లు, మూడు క్లబ్‌లకు వైరా ఐఎంఎల్ డిపో నుంచి మద్యం మద్యం సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా అన్నిరకాల మద్యాన్ని మూడులక్షలకుపైగా కేసుల వరకు సరఫరా చేస్తున్నారు. వీటి విలువ రూ.200కోట్లకుపైగా ఉంటుంది. ఈ మూడులక్షల కేసుల మద్యంలో కేవలం ఓఏబీ, ఎంహెచ్ రకాల మద్యం కేసులే దాదాపు లక్షకుపైగా కేసులు ఉంటాయి. ఇప్పుడు ఈ రెండు రకాల మద్యం సరఫరా లేక కొరత ఏర్పడింది.

భారీగా తగ్గిన సరఫరా

ప్రతినెలా వైరా ఐఎంఎల్ డిపోకు ఓఏబీ మద్యం లారీలు 40నుంచి 50వరకు వస్తాయి. ఒక్కో లోడ్ 2వేల కేసుల వరకు ఉంటుంది. ఈనెలలో ఇప్పటివరకు కేవలం ఐదారు ఓఏబీ మద్యం లోడ్లు మాత్రమే ఇక్కడకు వచ్చినట్లు సమాచారం. ఎంహెచ్ రకం మద్యం లోడ్లు 20నుంచి 25వరకు ఐఎంఎల్ డిపోకు వస్తుంటాయి. ఒక్కో లోడ్‌లో 1,100కేసులుంటాయి. ఇది సరాసరి 30వేల కేసులుగా ఉంటున్నాయి. అయితే ఈ 15రోజుల్లో ఈ మద్యం కూడా అరకొరగానే వైరాకు వచ్చింది. ఈ రెండురకాల మద్యం విలువ రూ.60కోట్లకుపైగా ఉంటుందని అంచనా.

మద్యం ప్రియుల అసంతృప్తి

డిస్టిలరీల నుంచి వైరా ఐంఎంఎల్ డిపోకు కొరత ఉన్న మద్యం సరఫరా కావడం లేదు. దాంతో ఐఎంఎల్ డిపో నుంచి వైన్‌షాపులకు మద్యం సరఫరా లేకపోవడంతో మద్యం ప్రియులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా ఎంఎల్ఎల్ డిపో ఇన్‌చార్జ్ డీఎం చేకూరి నారాయణరావు మాట్లాడుతూ మద్యం కొరత ఉందని పేర్కొన్నారు. పలు బ్రాండ్లు తక్కువగా సరఫరా అవుతు న్నందున ఆ మేరకే దుకాణాలకు ఇస్తున్నట్లు తెలిపారు.

నాలుగు క్వింటాళ్ల గంజాయి పట్టివేత

కొత్తగూడెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రూ.కోటి విలువైన గంజాయిని పట్టుకొని నిందితులను ఆరెస్టు చేసినట్లు ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి కలిమెల నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల గంజాయిని భద్రాచలంటౌన్ పోలీసులు పట్టుకున్నారు. భద్రాచలం ఎస్ఐ పీవీఎన్ రావు పట్టణంలోని బొమ్మ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్ బస్సులో నాలుగు క్వింటాళ్ల గంజాయిని గుర్తించారు. ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని.. ఎనిమిది మంది నిందితులను చేశారు.

ప్లాస్టిక్ ట్రేలు... డోర్ మ్యాట్ల మధ్యలో ఉంచి రావాణా

ప్లాస్టిక్ ట్రేలు, డోర్ మ్యాట్ మధ్యలో కట్ చేసి అందులో గంజాయి అమర్చి కింద పైన ట్రేలు, డోర్ మ్యాట్‌లు యథావిధిగా ఉంచి కట్టకట్టి బస్సుపైన వేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ గంజాయి విలువ మార్కెట్‌లో సుమారు రూ.కోటి ఉంటుందని ఎస్పీ తెలిపారు. గంజాయితో పాటు హర్యానా రాష్ట్రానికి చెందిన బల్జిత్, రవిదాస్, సూరజ్, గిన్న, తక్‌దీర్, రామ్మోహర్, సుందర్, రాజ్బతిలను అరెస్టు చేశారు. వీరు ఒడిశా రాష్ట్రానికి చెందిన కోలా ఆనంద్ అలియాస్ బజ్జి, బాల్‌రెడ్డి నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని, ప్రైవేటు ట్రావెల్స్, ట్రాన్స్‌పోర్టు యజమానులు మత్తుపదార్థాలు రవాణా కాకుండా అరికట్టాలని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎస్పీ పరితోజ్ పంకజ్, భద్రాచలం సీఐ రాయల వెంకటేశ్వరరావు, టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ జె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


నిందితుల వివరాలు ఎస్పీ రోహిత్ రాజు

12 కిలోల గంజాయి పట్టివేత

ఇల్లెందుటౌన్: ఇల్లెందు పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఒడిషాకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. గంజాయి విలువ రూ2.50 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు.

ఎన్టీఆర్ భారతరత్న పురస్కారానికి అర్హుడు

- టీడీపీ పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి 17: తెలుగు రాష్ట్రాల ప్రజల అభిమాన నటుడు రాజకీయ నాయకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో వారం రోజులుగా ఖమ్మం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరిశ్చంద్ర ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ, పోస్టుకార్డుల ద్వారా రాష్ట్రపతికి అభ్యర్థన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పోట్ల నాగేశ్వరరావు, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు శనివారం హాజరై సంతకం చేసిన పోస్ట్‌కార్డ్‌ను పోస్ట్ బాక్స్‌లో వేసి పూర్తిమద్దతు తెలిపారు.


పోస్టుకార్డును రాష్ట్రపతికి పంపుతున్న మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు

పీఏసీఎస్ చైర్మన్ పదవికి తీర్థాల రాజీనామా

కామేపల్లి, ఫిబ్రవరి 17: కామేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ పదవికి తీర్థాల చిదంబరరావు రాజీనామా చేశారు. శనివారం జిలాల్ల సహకార కార్యాలయంలో రాజీనామా పత్రాన్ని డీసీవో మురళీధర్‌కు అందజేశారు. అయన రాజీనామాను ఆమోదించి వైఎస్ చైర్మన్‌గా ఉన్న కాట్రాల రోషయ్యకు అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. అయితే ఈ నెల 19న అధ్యక్షుడిపై జరగాల్సిన అవిశ్వాస సమావేశం రద్దు చేసినట్లు డీసీవో మురళీధర్ తెలిపారు. జిల్లా అధికారులు ముద్దులపల్లి వెళ్లి వైఎస్ చైర్మన్ కాట్రాల రోషయ్యకు బాధ్యత పత్రాలను అందజేశారు.

అధిక వడ్డీ ఆశచూపి మోసం

ఖమ్మం క్రైమ్, ఫిబ్రవరి, 17: అధిక వడ్డీ చెల్లిస్తానంటూ నమ్మించి డబ్బులు తీసుకుని మోసంచేసిన సంఘటనలో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నగరంలోని పంపింగ్‌వెల్ రోడ్‌కు చెందిన సలీం అనే వ్యక్తి ఎక్కువ వడ్డీ ఇస్తానని నమ్మించి కొందరి వద్ద నుంచి సుమారు రూ. కోటికి పైగా వసూలు చేశాడు. తిరిగి ఇవ్వక పోవడంతో బాధితులు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

గిరి'జన'గోస వినేదెవరు ?

- అటవీ అనుమతులు లేక ముందుకుసాగని రహదారులు
- పూర్తిస్థాయిలో అందని పోడు పట్టాలు
- ఆసుపత్రుల్లో తీవ్రంగా సిబ్బంది కొరత
- నేడు ఐటీడీఏ పాలకమండలి సమావేశం
- పాల్గొననున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలం, ఫిబ్రవరి 17: భద్రాచలం ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజనుల గోస ఆలకించేదెవరు..? గత దశాబ్ద కాలంగా అప్పటి ప్రభుత్వం భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించకపోవడంతో అనేక సమస్యలు పేరుకుపోయాయి. ప్రధానంగా రహదారులు, విద్య, వైద్యం, పోడు, సాగు, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఏజెన్సీలో గిరిజనుల గోడు వినే ఐటీడీఏ ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా నామమాత్రంగామారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఐటీడీఏ పాలక మండలి సమావేశం మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సి ఉన్నా కనీసం సంవత్సరానికి ఒకసారి కూడా నిర్వహించడం లేదంటే గిరిజనులపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. గిరిజనులకు గత ప్రభుత్వ హయాంలో పోడు పత్రాలు అందినా ఆయా భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. ఐటీడీఏ పరిధిలో 40 శాతం పోడు సాగుదారులకు ఇంకా పోడు పట్టాలు అందలేదు. గత మూడేళ్ల నుంచి జిల్లా విద్యాశాఖకు రెగ్యులర్ సారధి కరువయ్యాడు. 23 మండలాలకు రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. చివరకు ఐటీడీఏ చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పర్యవేక్షించేందుకు వాహనాలు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో యూనిట్ అధికారులు వాటిని పర్యవేక్షించేడం కష్టతరంగా మారింది. భద్రాచలం, మణుగూరు, ఏరియా వైద్యశాలలు, పీహెచ్‌సీల పరిధిలో వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఏజెన్సీలో వైద్యం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో 19నెలల తరువాత భద్రాచలం ఐటీడీఏ పాలక మండలి సమావేశం ఆదివారం నిర్వహిస్తుండటంతో ఈ సమావేశంలోనైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందా అని గిరిజనులు ఎదురు చూస్తున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలతో పాటు ఇరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్‌లు, వివిధ శాఖల ప్రధాన అధికారులు పాల్గొననున్నారు.


రాయిగూడెం గ్రామం వద్ద వర్షాకాలంలో ఇదీ దుస్థితి (ఫైల్)

రహదారులకు 'అటవీ' అడ్డంకులు

ఆళ్లపల్లి మండలంలో మర్కోడు, రేగళ్లరోడ్డు, బోడాయికుంట, అడవిరామవరం, లక్ష్మీపురం-వెంకటాపురం, బాటన్ననగర్-రాయిగూడెం రోడ్డులకు అటవీశాఖ అనుమతులు లేక రహదారుల నిర్మాణం నిలిచిపోయియంది. అలాగే చర్ల, దుమ్ముగూడెం, ఆళ్లపల్లి, గుండాల, పినపాక మండలాల్లో ఎల్‌డబ్ల్యు కింద 15 రహదారులు, 12 వారధులు కూడా అటవీశాఖ అనుమతుల కారణంగా నిలిచిపోయాయి.

రెగ్యూలర్ ఎఈంవోలు కరువు

భద్రాద్రి జిల్లాలోని 23 మండలాల్లో ఎక్కడా రెగ్యూలర్ ఎంఈవోలేరు. ఒక్కొక్క హెచ్ఎం మూడు నుంచి ఐదు మండలాలకు ఎంఈవోలుగా పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పరిపాలనపరంగా ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

డబుల్‌బెడ్‌రూంలకు మోక్షమెన్నడు ?

భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. మొత్తం 7,513 ఇళ్లు మంజూరు కాగా వీటిలో 40 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. చాలాచోట్ల డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు తమకు ఎప్పుడు కేటాయిస్తారో తెలియక పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు.


మర్కోడు లొద్దిగూడెం మధ్య రహదారి పరిస్థితి (ఫైల్)

ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత

భద్రాచలం ఐటీడీఏకే తలమానికంగా ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రి నాలుగు రాష్ట్రాలకు చెందిన వారు వచ్చి వైద్య సహాయం పొందుతూ ఉంటారు. ఈ వైద్యశాలలో 205 పోస్టులు మంజూరు కాగా 119 మంది వైద్యులు, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల వరకు ఒక్కరే గైనకాలజిస్టు సేవలందిస్తున్నారు. మణుగూరులోని ఏరియా వైద్యశాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, భద్రాచలం అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వోతో పాటు కుష్టువ్యాధి ప్రోగ్రామింగ్ అధికారిగా ఒక్కరే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 14 వైద్యుల పోస్టులు, ఎంపీహెచ్ఏ మేల్ 47పోస్టులు, స్టాఫ్‌నర్సు పోస్టులు ఐదు ఖాళీగా ఉన్నాయి. అన్నింటికంటే ప్రధానంగా వైద్యఆరోగ్యశాఖలో జిల్లా ప్రోగ్రామింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారందరూ అదనపు బాధ్యతలతోనే కొనసాగుతుండడం గమనార్హం.

మట్టిలో మాణిక్యాలు..

- రెండు ఉద్యోగాలు సాధించిన సీతంపేట యువతి
- మూడు ఉద్యోగాలకు ఎంపికైన మల్లవరం యువకులు

సుజాతనగర్/ తల్లాడ, ఫిబ్రవరి 17: ప్రయత్నానికి పట్టుదల తోడైతే విజయం సాధించవచ్చని నిరూపించారా యువతీ యువకులు. పేద కుటుంబ నేపథ్యం అయినా కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. సుజాతనగర్ మండలం సీతంపేట బంజర గ్రామానికి చెందిన లావుడ్యా కమల గురుకుల విద్యాసంస్థల్లో రెండు ఉద్యోగాలు సాధించింది.


కమల, సైదులు, తిరుపతిరావు

ఆమె గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో పీడీగా రెండింటిలోనూ ఎంపికయ్యారు. ఇంటర్ కళాశాల పీడీ ఉద్యోగాల్లో మొదటి ర్యాంకు, డిగ్రీ కళాశాల పీడీ ర్యాంకుల్లో రెండవ ర్యాంకు సాధించానని ఆమె తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ గురుకుల డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో రెండు ఉద్యోగాలు సాధించిన కమల డిగ్రీ కళాశాల పీడీగా సేవలందిస్తానని తెలిపారు. లావుడ్యా కమల 2022లో స్టేట్ ఎలిబిలిటీ టెస్ట్ ఉత్తీర్ణత సాధించింది.

తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన కుంచం సైదులు, తుటారి తిరుపతిరావు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కుంచం సైదులు 2020వ సంవత్సరంలో రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తిరిగి 2023లో సైదులు సింగరేణి జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2 ఉద్యోగానికి, తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగంలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తుటారి తిరుపతిరావు 2022లో కేంద్రప్రభుత్వ సీఐఎస్ఎఫ్ శాఖలో జేడీ కానిస్టేబుల్‌గా, 2023లో సీఐఎస్ఎఫ్ శాఖలో ఫైర్ కానిస్టేబుల్‌గా, రాష్ట్ర పోలీసుశాఖ ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

విద్యార్థినిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి ?

కల్లూరు, ఫిబ్రవరి 17: మండలంలోని ఓ గ్రామంలో శనివారం ఉదయం ఓ విద్యార్థిని స్థానిక చర్చిలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని యువకులు దాడి చేసినట్లు తెలుస్తోంది. బాధితురాలు గ్రామస్థులకు తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గువెంకటపురంలో ఓ విద్యార్థిని తన ఇంటికి సమీపంలో ఉన్న ఓ చర్చిలో నిద్రిస్తుండగా అకస్మాత్తుగా ఇద్దరు యువకులు ముఖానికి నల్ల వస్త్రాలు ధరించి సదరు విద్యార్థినిపై దాడి చేసి బ్లేడుతో గాయపరిచారు. ఆ సమయంలో బాధితురాలు అరవకుండా నోట్ల వస్త్రం కుక్కి రెండు కాళ్లను అదిమిపట్టగా చెబుతోంది. ఆమె వారిని వదిలించుని గట్టిగా కేకలు వేయటంతో దుండంగులు పారారయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి సదరు విద్యార్థిని విడుదల చేసిన విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై స్పందించిన కల్లూరు పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి విచారించారు. అయితే బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు మాత్రం దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదు. అలాగే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ షాకీర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మధిర రోడ్లకు మహర్దశ

- నియోజకవర్గానికి రూ.334.88 కోట్ల మంజూరు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషితో నిధులు
- పాదయాత్ర సమయంలో విన్నపాలు, స్థానిక నేతల విజ్ఞప్తి మేరకు కేటాయింపులు

మధిర,ఫిబ్రవరి17: మధిర నియోజకవర్గ రహదారులకు మోక్షం లభించింది. సుదీర్ఘకాలంగా బాగుపడని గ్రామీణ రహదారులకు మహర్దశ కలిగింది. మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక కృషితో రూ.334.88 కోట్లు నిధులు మంజూరూ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 80 రోడ్ల నిర్మాణానికి ఈ నిధులు కేటాయించనున్నారు. మధిర నియోజకవర్గంలో భట్టి పాదయాత్ర చేసిన సందర్భంగా వచ్చిన విజ్ఞాపనలతో పాటు, పార్టీ ప్రతినిధుల నుంచి వచ్చిన విన్నపాలను పరిగణలోకి తీసుకొన్న భట్టి తక్షణమే బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరికి ఆదేశాలు జారీ చేశారు. ఏకకాలంలో 80 బీటీ రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించటం చరిత్రలో ఇదే తొలిసారి.. కాంగ్రెస్ పార్టీ అన్నిమండలాల నాయకులు, శ్రేణులు, ఆయా గ్రామాలకు రోడ్డు సదుపాయం కలగనుండటంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్లన్నీ బీటీగా మారితే మధిర నియోజకవర్గంలో రహదారి సదుపాయం సమకూరినట్లే...



నిధులు మంజూరైన గంధసిరి నుంచి పెద్దమండవ రహదారి

మధిర మండలంలో 12 రోడ్లు

మధిర-ఆత్కూరు వయా వరదరాఘవాపురం రూ.1.20 కోట్లు, చిలుకూరు-దొడ్డదేవరపాడు రూ.1.60కోట్లు, మర్లపాడు-పెనుగొలను రూ.2.75కోట్లు,అల్లీనగరం-బయ్యారం రూ.2కోట్లు, దేశినేనిపాలెం-మడుపల్లి రూ.6.50కోట్లు, మాటూరు-మధిర ముస్లింకాలనీ రూ.5కోట్లు, ఆర్అండ్‌బీరోడ్డు జాలిముడి ప్రాజెక్టు వరకు రూ.52లక్షలు, చిలుకూరులో ఆర్ అండ్‌బీ రోడ్డు-శివాలయం వరకు 70లక్షలు, మాటూరు పేట-అంబారుపేట 4.80కోట్లు, మడుపల్లి-శివాలయం 2.50 కోట్లు, మాటూరుపేట-పెనుగోలను 2.25 కోట్లు, రొంపిమళ్ల-యండ్రపల్లి 2.80కోట్లు నిధులు మంజూరయ్యాయి.

బోనకల్ మండలంలో 13 రోడ్లు

తూటికుంట్ల-వల్లాపురం రూ.1.79కోట్లు, రాపల్లె-జాలిముడి రూ.1.71కోట్లు, పీడబ్ల్యు రోడ్డు-మోటమర్రి ఎస్సీ కాలనీ 2.26కోట్లు, లక్ష్మీపురం-తూటికుంట్ల 2.98కోట్లు, తూటికుంట్ల-గొల్లెనపాడు 2.25కోట్లు,లక్ష్మీపురం-పాతర్లపాడు 2.77కోట్లు, గోవిందాపురం-వల్లాపురం 2.19కోట్లు, మోటమర్రి-గోవిందాపురం 4.22కోట్లు, ఆళ్లపాడు-నారాయణపురం 5.39కోట్లు, ఆర్ అండ్‌బీ రోడ్డు- పెద్దబీరవల్లి రూ.61లక్షలు, సీడబ్ల్యు రోడ్డు -పెద్దబీరవల్లి రూ.81.15లక్షలు, ఆళ్లపాడు-కేఎల్‌రావు రోడ్డు-గోవిందాపురం రూ.2.89 కోట్లు మంజూరయ్యాయి.

చింతకాని మండలంలో 17 రోడ్లు

బొప్పారం-గాంధీనగర్‌కాలనీ రూ.1.75కోట్లు, నాగులవంచ-తిమ్మినేనిపాలెం రూ.6.75కోట్లు, నాగులవంచ-తిమ్మినేని పాలెం తిర్లాపురం క్రాస్‌రోడ్డు రూ.3.50కోట్లు, తిమ్మినేని పాలెం-పొలంపల్లి వయా చిన్నమండవ రూ.9కోట్లు, పొద్దుటూరు-పాతర్లపాడు రూ.7కోట్లు, పాతర్లపాడు-గోవిందాపురం 6.20కోట్లు, రాఘవాపురం-అల్లీపురం 2కోట్లు, రాఘవాపురం-లచ్చగూడెం 2.80కోట్లు, నాగిలిగొండ-కొండవనమాల 4.50కోట్లు, వందనం -పుట్టకోట 4కోట్లు, నాగలిగొండ-గొల్లెనపాడు 7.10కోట్లు, రేపల్లెవాడ-నేరడ 5.60కోట్లు, రాఘవాపురం- స్టేడియం 3.20కోట్లు, రేపల్లెవాడ-లక్ష్మీపురం 6.80కోట్లు, రేపల్లెవాడ-ఎన్ఎస్‌పీ కెనాల్ 2.70కోట్లు, రామకృష్ణాపురం-పండ్రేగుపల్లి 2.20కోట్లు, నాగులవంచ-పోలంపల్లి 5.50కోట్లు మంజూరయ్యాయి.

ఎర్రుపాలెం మండలంలో..13 బీటీ రోడ్లు

కొత్తపాలెం టు గట్లగౌరారం 10కి.మీ. 20కోట్లు, భవానీపురం టు కాచవరం 8కి.మీ. 16కోట్లు, పీడబ్ల్యు రోడ్డు టు బుచ్చిరెడ్డిపాలెం వయా అయ్యవారి గూడెం 7.24 కి.మీ. 6.50కోట్లు, మామునూరు టు బుచ్చిరెడ్డిపాలెం వయా వయా లక్ష్మీపురం 3.74కి.మీ. 2.30కోట్లు, వెంకటాపురం టు బుచ్చిరెడ్డిపాలెం 5.6కి.మీ. 6కోట్లు, నాయణపురం టు రాజుపాలెం 1.10కి.మీ. 95లక్షలు, ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ టు పెగళ్లపాడు వయా పీడబ్ల్యు రోడ్డు 2.40కి.మీ. 2.40కోట్లు, మీనవోలు టు బనిగండ్లపాడు 1.70కి.మీ. 1.70కోట్లు, భీమవరం టు గోసవీడు 2.80కి.మీ. 15కోట్లు, బుచ్చిరెడ్డి పాలెం టు వెంకటాపురం పీఆర్ రోడ్డు జమలాపురం వరకు 2.20 కి.మీ. 2.20కోట్లు, రాజుపాలెం టు కొత్తగుండ్ల బ్రహ్మయ్య ఫీల్డ్ వరకు 1.60కి.మీ. 1.60కోట్లు, బనిగండ్లపాడు టు తక్కెళ్లపాడు 3.40కి.మీ. 2కోట్లు, మామునూరు టు రాజుదేవరపాడు 0.90కి.మీ. 90లక్షలు నిధులు మంజూరయ్యాయి.

ముదిగొండ మండలంలో.. 25 బీటీ రోడ్లు

ముత్తారం-వల్లాపురం రూ.4కోట్లు, వల్లాపురం-గంధసిరి 4.40కోట్లు, గంధసిరి పెద్దమండవ 7.50కోట్లు, పెద్దమండవ-మల్లారం 4.30కోట్లు, సువర్ణాపురం-ముత్తారం 1.75కోట్లు, గోకినేపల్లి-కట్టకూరు 5.30కోట్లు, కట్టకూరు-సీతారాంపురం 2.20కోట్లు, జడ్పీ రోడ్డు-ముత్తారం 2.30కోట్లు, మల్లారం మల్కాపురం 2.80కోట్లు, మల్లారం-గంధ్రాయి 2.30కోట్లు, గోకినేపల్లి -చిరుమర్రి 7.50కోట్లు, గోకినేపల్లి-మేడేపల్లి 3.75 కోట్లు, కమలాపురం-అయ్యగారిపల్లి 2కోట్లు, చిరుమర్రి-కిష్టాపురం 3.85కోట్లు, చిరుమర్రి-వెంకటాపురం 6.75కోట్లు, గంధసిరి-వల్లాపురం 4కోట్లు, గంధసిరి-అమ్మపేట శ్రీవెంగొండ వేంకటేశ్వరస్వామి టెంపుల్ 3.25కోట్లు, గంధసిరి-బాణాపురం 5.45కోట్లు, పెద్దమండవ-మల్కాపురం 3.40కోట్లు, అయ్యగారిపల్లి-బాణాపురం తండా 3.50కోట్లు, కమలాపురం-జిల్లేడుగడ్డ 2.25కోట్లు, అయ్యగారిపల్లి ఎస్సీ కాలనీ ఆర్ అండ్‌బీ రోడ్డు -వెంకటాద్రి చెరువు అలుగువరకు 1.60 కోట్లు, కమలాపురం అంకమ్మ టెంపుల్ నుంచి అమ్మపేట శ్రీవెలుగొండ వేంకటేశ్వరస్వామి టెంపుల్ వరకు 3కోట్లు, కమలాపురం ఎస్సీ కాలనీ -పమ్మి 2.40కోట్లు. వనంవారి కృష్ణాపురం- సువర్ణాపురం క్రాస్‌రోడ్డు రూ.4కోట్లు నిధుల మంజూరయ్యాయి.

సోమవరంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



సోమవరంలో అభయాంజనేయస్వామి ఆలయం, చక్రబంధం పూజలు చేస్తున్న భక్తులు

వైరా, ఫిబ్రవరి17: వైరా మునిసిపాలిటీ పరిధిలోని 10,11 వార్డులకు చెందిన సోమవరంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 19న సోమవారం అభయాంజనేయ, నాభిశిల, ముత్యాలమ్మ తదితర దేవతా విగ్రహాల ప్రతిష్ఠ జరుగనుంది. ఈ నేపథ్యంలో వారం నుంచి గ్రామంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ ఇంటిపై అభయాంజనేయస్వామి జెండాలను ఆవిష్కరించారు. ప్రధాన రహదారి సహా అంతర్గత రహదారులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ధ్వజస్తంభ ఊరేగింపును నిర్వహించారు. హోమాలు, చక్రబంధం వంటి పూజా కార్యక్రమాలను సంప్రదాయ రీతిలో నిర్వహిస్తున్నారు. 19న అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

మూడు గంటలకే ఉపాధ్యాయులు ఇళ్లకు!

- చంద్రుపట్ల పాఠశాలలో ఇష్టారాజ్యం

కల్లూరు,ఫిబ్రవరి17 విధులు సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొందరు ఉపాధ్యాయులు పాఠశాల సమయంలోనే మధ్యలో వెళుతున్నారు. ఈ సంఘటన మండలంలోని చంద్రుపట్లలో జరిగింది. జడ్పీ ఉన్నత పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు సొంత పనుల కోసం ఇష్టారాజ్యంగా విధులకు డుమ్మా కొట్టి వెళ్లగా విద్యార్థులు తరగతి గదుల్లో ఖాళీగా కూర్చుంటున్నారు. ఫిజిక్స్ ఆంగ్ల ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరెడ్డి, అమరనాథ్ పాఠశాల ముగిసే సమయం 4:45 వరకు ఉండాల్సి ఉండగా మధ్యహ్నం 3గంటలకే ఇళ్లకు వెళ్లారని గ్రామస్థులు తెలిపారు. హెచ్‌ఎంకు వివరణకై విలేకరులు ప్రయత్నించగా హెచ్‌ఎం కూడా అర్ధగంట ముందుగానే పాఠశాల నుంచి డీఈవో కార్యాలయానికి అని చెప్పి బయటకు వెళ్లారని తెలిపారు. ఎంఈఓ దామోదర ప్రసాద్‌ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, పాఠశాలకు వెళ్లి తదుపరి విచారణ జరపుతాయని చెప్పారు.

సన్మార్గంలో ప్రయాణించాలి

ఏన్కూరు,ఫిబ్రవరి17: గురువులు సూచించిన సన్మార్గం లో ప్రయాణించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని కస్తూర్బాగాంధీ విద్యాలయ ఎస్‌వో ఉషారాణి అన్నారు. శని వారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో మాట్లాడారు. నైతిక విలువలను అలవ ర్చుకొని సమాజంలో మంచిగుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

కమర్తపు మురళికి సన్మానం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి17: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన కమర్తపు మురళిని శనివారం తెలంగాణ ప్రైవేటు టీచర్స్ ఫోరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. నగరంలోని కమర్తపు మురళి కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చౌహాన్, జిల్లా ప్రచార కార్యదర్శి ఎం.రమేష్, రమణ, డివిజన్ నాయకులు కిషోర్, సురేష్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి శిక్షణ

సత్తుపల్లిరూరల్,ఫిబ్రవరి17: సత్తుపల్లిలో యువతకు ఉపాధి అవకాశాలపై ఇస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది.రాష్ట్ర ఉపాధి శిక్షణ డైరక్టరేట్ నైపుణ్యాభివృద్ధి, ఏపీప్రొడక్టవిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మునిసిపల్ భవనంలో నిర్వహించిన స్వయం ఉపాధి-వేతన ఉపాధి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించి శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పానాధికారి కొండపల్లి శ్రీరామ్, మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాత, కో-ఆర్డినేటర్లు ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

విద్యతో భవిష్యత్ తరాలకు బాట

కామేపల్లి, ఫిబ్రవరి 17: విద్యతో భవిష్యత్ తరాలకు బాటలు వేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పాతలింగాల కేజీబీవీ పాఠశాలలో వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. విద్య ఉంటేనే విలువ ఉంటుందన్నారు. అనంతరం సూర్యపేటకు చెందిన పిడియాట్రిక్ విద్యాసాగర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు.

నిధుల మంజూరు పట్ల హర్షం

మధిరటౌన్, ఫిబ్రవరి17:మధిరలోలింకురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది నందుకు కృషి చేసిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు జిల్లా కాంగ్రెస్ నాయకులు చెరుకూరి నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు. మధిర అభివృద్ధికి రూ.300 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

పరీక్ష సామగ్రి అందజేత

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి17: మండల పరిధిలోని ఏదులాపురం ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు డిప్యూటీ రేంజ్ అధికారి పి.సురేష్ కుమార్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు శనివారం వితరణగా అందజేశారు. అల్పాహారం కోసం రూ.4వేలు అందజేశారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

చింతకాని, ఫిబ్రవరి17: పీపుల్స్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తిరుమలాపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ప్లేట్స్, బ్యాగ్‌లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, కాంప్లెక్స్ ఎచ్‌ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మరీదు రాధిక, ఎచ్‌ఎం బాబురావు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి, చైర్మన్ కృష్ణ, కరస్పాండెంట్ ధాత్రి

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి17: ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు ఇన్నోవేషన్ సెంటర్‌ను చైర్మన్ గుండాల కృష్ణ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి హాజరై మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలను రూపొందించాలంటే ప్రతీ విద్యార్థి ఆత్మవిశ్వాసం, నమ్మకం కలిగా ఉండాలని అన్నారు. దీని ఏర్పాటుకు చొరవ తీసుకున్న కళాశాల యాజమాన్యాన్ని, సిబ్బందిని అభినందించారు.కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జీవితంలో ఉన్నత రంగంలో స్థిరపడేందుకు ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగిఉండాలి

- డీఈవో సోమశేఖర శర్మ
- ఘనంగా విన్‌ఫీల్డ్ పాఠశాల 9వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్ పుల్లారావు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి17: విద్యార్థిదశ నుంచే నైతికవిలువలు, నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని జిల్లావిద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాల 9వ వార్షికోత్సవం శనివారం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాణ్యమైన విద్య, క్రమశిక్షణను అందిస్తున్న విన్‌ఫీల్డ్ యాజమాన్యాని అభినందించారు. విద్యార్థులు చదువు తోపాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. కార్పోరేటర్లు మిక్కిలినేని మంజుల నరేంద్ర, చావా మాధురి నారాయణరావు మాట్లాడుతూ కృషి పటుదలతో ఏదైనా సాధించవచ్చునని, విద్యా వినయం ఉన్నవారు, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ మాట్లాడారు. పాఠశాల వార్షిక నివేదకను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థినికి స్టేట్ ఫస్ట్‌ర్యాంక్



గాయత్రి తన్విషను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీధర్‌రావు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి17: ఇండియన్ బ్రిలియన్స్ ఒలంపియాడ్స్ (అసోసియేటెడ్ విత్ తెఫ్) రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ఖమ్మం రెజొనెన్స్ శ్రీనగర్ పాఠశాల విద్యార్థిని కె.గాయత్రి తన్విష రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించింది. ఈ వివరాలు పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో సర్టిఫికేట్ అందించారని తెలిపారు. రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో అభినందన సభలో డైరెక్టర్స్ కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి మాట్లాడారు. మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి పొందిన కె.గాయత్రి తన్విషని అభినందించారు. అన్ని రంగాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

రైతులకు తప్పనిసరిగా బిల్లులివ్వాలి: ఏడీఏ



నేలకొండపల్లిలో తనిఖీ చేస్తున్న కూసుమంచి ఏడీఏ

నేలకొండపల్లి, ఫిబ్రవరి17: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా బిల్లులివ్వాలని కూసుమంచి సహాయవ్యవసాయ సంచాలకుడు(ఏడీఏ) విజయచంద్ర దుకాణదారులను ఆదేశించారు. శుక్రవారం మండలవ్యాప్తంగాఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలను, నేలకొండపల్లి సహకార సంఘం కింద ఉన్న అప్పలనర్సింహాపురం, పైనంపల్లి సహకార సంఘం గోడౌన్లను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌తో సరి చూశారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. దేనికీ కొరత లేదన్నారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీఏ వెంట ఏవో దేశబోయిన అరుణ ఉన్నారు.

గీతాంజలిలో స్పోర్ట్స్‌డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలను చేస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 17: ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్‌లోని గీతాంజలి పాఠశాలలో శనివారం స్పోర్ట్స్‌డే వేడుకలను పాఠశాల డైరెక్టర్ టీ.పద్మా జ్యోతిప్రజ్వల చేసి ప్రారంభించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టీవి అప్పారావు, డైరెక్టర్ అరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా న్యూఇరా 29వ వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వల నిర్వహిస్తున్న పాఠశాల చైర్మన్, డైరెక్టర్లు, విద్యార్థుల నృత్యాలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి17: ఖమ్మం నగరంలోని న్యూఇరా పాఠశాలలో 29వ వార్షికోత్సవాన్ని శనివారంరాత్రి పాఠశాల ప్రాంగణంలో చిన్నారుల కేరింతలు, ఆటపాటలతో సందడిగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డీఈవో సోమశేఖర్‌శర్మ హాజరయ్యారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా లక్ష్యసాధనకు కృషి చేయాలని తెలిపారు. భవిష్యత్తులో టెక్నాలజీ రంగంలో అనేక మార్పులు చోటుచేసు కోబోతున్నాయని, ఆ మార్పులకు తగ్గట్టు విద్యార్థులు సిద్ధమై అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపు నిచ్చారు. వివిధ కళలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ ఐ.వి. రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలన్నారు. విలువలతో కూడిన విద్య ప్రతీ విద్యార్థికీ అవసరమని అన్నారు. ప్రతీ విద్యార్థిపై పర్యవేక్షణ ఉంటుందని కేవలం చదువేకాక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల మీద కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు.

మిస్ట్‌లో ముగిసిన వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ

సత్తుపల్లి, ఫిబ్రవరి17: సత్తుపల్లి మండలంలో నూతనంగా నిర్మితమవుతున్న గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేను మండలంలోని కొత్తూరులోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్, ఎంటెక్ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు శనివారం సందర్శించారు. కళాశాలలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. స్టాడ్ ప్రో సాఫ్ట్‌వేర్ ద్వారా సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అత్యాధునిక నిర్మాణాలకు రూపొందించేందుకు కావాల్సిన డిజైన్స్ ఎలా రూపొందించాలో హైదరాబాద్‌కు చెందిన డిజైన్స్ ల్యాబ్ శిక్షకులు వివరించారన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ఎల్ఎస్.సాయి ఇంద్రసేనారెడ్డి, డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, కన్వీనర్ కే.రామకృష్ణారెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దాతకు సన్మానం



సూరంపల్లిని సన్మానిస్తున్న దృశ్యం

కొణిజర్ల,ఫిబ్రవరి17: పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి నగదు అందజేస్తున్న కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావును శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు శాలువలతో సన్మానించారు. ఇటీవల సర్పంచ్‌గా రామారావు పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల అల్పారాన్ని అందించేందుకు, క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులకు రూ. 30వేలు వితరణగా అందించారు. సూరంపల్లిని సన్మానించడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



వద్దిరాజు యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర యూత్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఖమ్మంలో నిర్వహించారు. నగరంలోని పాతబస్టాండ్‌సెంటర్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వద్దిరాజు రవిచంద్రయూత్ సభ్యులు సుంకర చిరంజీవి, ఆకుల సాయి, తుపాకుల సాయి, మహ్మద్ కరీం, జూపల్లిప్రవీణ్, మహ్మద్‌ఖ్వారు, జగదీష్, అఖిల్, క్రాంతి, తరుణ్, అజయ్,సోందు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. బోనకల్‌లో స్థానిక శాంతి నిలయంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఘనంగా నిర్వహించారు. మధిరలోని వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకలలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు కేక్‌కట్ చేసారు. పెనుబల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కనగాల వెంకట్రావ్ ఆధ్వర్యంలో శుక్రవారం థాయ్‌ల్యాండ్‌లో ఘనంగా నిర్వహించారు. కారేపల్లి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ మిఠాయిలు పంచారు. సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కట్‌చేసి మిఠాయిలు పంచారు.